# ఆరో ఆడపిల్లలు

ఆంగ్లం : రంగారావు

తెలుగు : దాసరి అమరేంద్ర

మీరు బహుశా డాక్టర్ మిస్ జాకబ్ గురించి వినే ఉంటారు. వింధ్య పర్వతాలకివతలి ప్రాంతంలో ఎంతో పేరూ ప్రఖ్యాతి గడించిన పురుళ్ల డాక్టరావిడ. మాకు మెడికల్ కాలేజీలో లెక్చెరరు కూడానూ. ఆవిడ దగ్గర వైద్యం నేర్చుకొన్నవాళ్లంతా దేశపు నలుమూలలా అనేకానేక వైద్య కళాశాలలలో హెడ్లాఫ్ డిపార్టుమెంట్లుగా అల్లుకుపోయారు. ఆవిడ పర్యవేక్షణలో రూపురేఖలు దిద్దుకొని బయట పడిన చిట్టచివరి బృందం మాది ; అది నిజంగా మా అదృష్టమనే చెప్పుకోవాలి.

రిటయిరయిన తర్వాత సొంతంగా మెటర్నటీ హోం పెట్టుకొని స్థిరపడ్డారావిడ. మేం క్లినికల్స్‌కు వెళ్లిన మొట్టమొదటి సంవత్సరమే ఆవిడ మాకు ఈ కథ చెప్పారు.

★ ★ ★

ఓ నాడు ఆవిడ వార్డుకు ఓ కష్టమయిన కానుపు కేసు వచ్చింది. కోస్తా ప్రాంతపు జమీందారీ ఫాయీ కుటుంబపు ఆఖరి కోడలు - ఆరో కానుపు. స్థితిపరుల ఇంటి కోడలేగానీ ఆవిడ శరీరస్థితి అంతంత మాత్రమే - ఒంట్లో అసలు రక్తమే లేదు. కావాలని ఉపవాసాలుండి ఆ పరిస్థితి కొని తెచ్చుకొందని ఆవిడ భర్తగారి కథనం.

ఉమ్మడి కుటుంబాల్లో ఉండే గొడవలే అవి. ఆవిడేమో ఆఖరి కోడలు. అత్తగారిమాట కుటుంబమంతటికీ సుగ్రీవాజ్ఞా సింహ స్వప్నమూనూ! రెండోసారి ఆడపిల్ల పుట్టినపుడే ఆ రాజమాతగారి శీతకన్ను ఈ కడసారి కోడలు మీదపడింది. మూడోసారీ, నాలుగోసారీ, అయిదోసారి కూడా ఆడపిల్లలే అయ్యేసరికి ఇక చెప్పేదేముందీ ? అత్తగారు అగ్గిమీద గుగ్గిలమైపోయారు. ఆఖరికోడలు తనకంట పడరాదని ఆంక్ష విధించారు. ఆరోసారి కూడా ఆడపిల్లే అయిన పక్షంలోనూ, తన పంచపాతకాలకూ పరిహారంగా ఆరోసారి మగనలుసును కనని పక్షంలోనూ, (పాపం శమించుగాక - పుత్రుడు లేని పితరులు పున్నామనరకం పాలవరూ?!) కడసారి కోడలికోసం అనంతమయిన అఖండమయిన బడితెపూజ కాచుకొనివుందనీ, పశువులు కూడా ఎన్నడూ చవిచూసిఉండని మహత్తరమైన మర్దనలకు సిద్ధం గావలసి ఉంటుందనీ కఠోరమైన హెచ్చరికను దయా దాక్షిణ్యాలు లేకుండా జారీచేసారు.

'మరి ఆయనగారి సంగతేమిటీ'- అంటారా?!

అతగాడికి పెళ్లామంటే ప్రేమే. సందేహం లేదు.

కానీ కన్న తల్లికున్న ఆస్తిపాస్తులంటే రెట్టింపు ప్రేమ!

నగలూ దిగులూ దిగేసుకొని ఆపిచ్చితల్లి తనకు ప్రాణాధారమో ప్రాణాంతకమో తెలిసీ తెలియని ఆ ఆరోకానుపు కోసం డాక్టర్ జాకబ్‌గారి వార్డులో చేరింది.

అనుకొన్నట్టే కానుపు కష్టమయింది.

కానీ డాక్టరమ్మ నైపుణ్యం పుణ్యమా అని ఆవిడ అమృత హస్తాల ద్వారా మరో చిరుప్రాణి విజయవంతంగా ఈ వింత ప్రపంచంలోకి అడుగుపెట్టింది.

కానీ ఆ ప్రాణిని ఆప్యాయంగా ఆహ్వానించే వాళ్లే కరువయ్యారు.

ఆడపిల్లయ్యే మరి - అదీ ఆరోసారి !

'మరి కానుపు విజయవంతమైంది అంటారేవిటి?' - అంటారా !

ఆడపిల్ల అన్న విషయం తెలియగానే ఆ పిచ్చితల్లి అన్నాహారాలు ముట్టడం మానేసింది. పచ్చిగంగను కూడా తాకనని పంతం వేసుకొని కూర్చొంది. ఒకటే ఏడు పాకటే ఏడుపు. అత్తగారి హెచ్చరిక ఓ దుష్టశక్తిలా ఆవిడ మనసును పట్టి పీడించసాగింది. తానిహ బతకడం దండగనీ, ఒకవేళ బతికి బట్టకట్టినా గొడ్డును బాదినట్టు బాది మరీ చంపి పెడతారనీ భయపడసాగింది.

అనేకానేక చిత్రవిచిత్రమైన ప్రసూతి సమస్యలను తన సుదీర్ఘపుటనుభవంతో అవలీలగా పరిష్కరించారు డాక్టరమ్మ. కానీ ఆరో ఆడపిల్ల సమస్యతో పీకలదాకా మునిగి ఉన్న ఆ కలవారి కోడలు సంగతి మాత్రం కొరుకుడు పడలేదు. దాన్నెలా పరిష్కరించాలో బోధపడలేదు. ఇల్లాంటి కేసు ఇంతకు మునుపు ఎక్కడైనా, ఎప్పుడైనా తటస్థించిందేమోనన్న ఆశతో లైబ్రరీ అంతా తిరగేసారావిడ. లాభం లేకపోయింది.

అన్నమూ నీళ్లూ ముట్టనే ముట్టనని భీష్మించుకొని కూర్చొన్నా ఆ కడసారి కోడలు అలాగే కృంగి కృశించి ప్రాణాలు వదిలేయబోతోందా ?

మర్నాటి సాయంత్రం డాక్టరమ్మ ఓ గ్లాసుడు పళ్లరసం పట్టుకొని ఆ చిన్నకోడలు దగ్గర కెళ్లారు. తాగమన్నారు. 'ఉహూఁ!' అని తల అడ్డంగా ఊపిందా ఆడపిల్లల తల్లి.

"తాగావంటే నీకో శుభవార్త చెపుతాను"

"ఏవిటదీ?! నా మొహానికి శుభవార్తలు కూడానా ?"

"తాగు చెబుతాను"

"మా అత్తగారు నా మానానికి నన్ను వదిలేస్తావన్నారా? నాకిహ బడిత బెడద లేనట్టేనా?" పిచ్చితల్లి లేచి కూర్చుంది.

"అవును. నీకిహభయం లేదు."

"సర్వాబద్ధం. మీకు మా అత్తగారి సంగతి తెలియదు. చచ్చినా నన్నొదలదు. నాలుగోసారి కూడా ఆడపిల్లను కన్నదని మా పనిమనిషినే చావదన్నిన మహానుభావురాలు ఆరో ఆడపిల్లను కన్న నన్ను వదలడమా . కలలోమాట. అసలావిడకు ఆడపిల్లలంటేనే

ఎక్కళ్లేని ఒళ్లుమంట. కావాలంటే మావారి నడగండి."

"నిజమే" భర్తగారు నిర్ధారించారు. "మా అమ్మగారికి ఆడపిల్లలంటే చెప్పరాని కంపరం. తనవరకూ తానే మీ పొరపాటు చెయ్యకుండా మా అందర్నీ మగపిల్లల్నే కంది"

"అమోఘం" పరమాశ్చర్యం వ్యంగ్య పరచి ఆఖరికోడలు వేపు తిరిగి ఓపిగ్గా వివ రించింది డాక్టరమ్మ. "ఈ సారి నీకు దెబ్బల ఇబ్బందిలేదు"

"ఏం ? ఎందుకనీ?! నేనేమైనా తలగొట్టి మొలేసానా? ఆవిడ మాటను లెక్క చెయ్య కుండా, ఆవిడ ఆజ్ఞను పక్కను పెట్టి, ఆవిడకు తీరని అపచారం చేసిన నన్ను వదలిపెట్టడమా!

తన మాటంటే లెక్కా జమా లేనట్టు ఆరోసారి కూడా ఆడపిల్లనే కన్నాను గదా - ఆవిడ అంటుందీ ... అసలావిడ ఎందుకు మనసు మార్చుకొన్నట్టూ?"

భర్తగారు నోరు విప్పేలోపలే (ఆయన గారు డెవిల్‌కూ ఆడపిల్ల గాథ సంద్రానికీ నడుమన చిక్కడిపోయారని మీరు అనవచ్చు!) డాక్టర్ జాకబ్ అందుకొన్నారు.

"మనసు మార్చుకోవడం గాదమ్మా ! అసలు ఇదో విచారకరమైన విషయం. నీకు చెప్పనేగూడదు. అయినా తప్పదం లేదు" భర్తగారి వేపు సాభిప్రాయంగా చూస్తూ పడనున్న బాంబు దెబ్బకు అతగాడిని సిద్ధం చేస్తూ అన్నారు



డాక్టర్ జాకబ్" మీ అత్తగారు హఠాత్తుగా పోయారు. గుండెపోటు"

ఆ గదిలోనే ఉండి ఆ సంభాషణ అంతా ఆలకించిన ఓ నర్సమ్మ ఆ క్షణాన డాక్టర్ జాకబ్‌గారి కళ్లల్లో నీళ్లు చిప్పిల్లా యన్న సంగతి ఇప్పటికీ ఒట్టేసి చెపుతూనే ఉంటుంది.

ఆ గదిలో గాలిస్తంభించింది.

డాక్టరమ్మ భర్తగారికేసి చూసింది

ఆ అమాయక ప్రాణి తన మొహాన్ని పైపంచలో దాచుకొని బుడి బుడి రాగాలు తీయసాగాడు.

"పోయిన మనిషి ఆత్మశాంతికోసం ఓ నిముషం పాటు మనమంతా నిశ్శబ్దం పాటిద్దాం" ఆంగ్లంలో ప్రకటించింది డాక్టర్ జాకబ్.

ఓ నిముషం పాటు వాతావరణమంతా నిశ్శబ్దంతో నిండిపోయింది.

"శివ శివా ! ఎంత పని చేసారు మేడమ్" గదిలోంచి బయటపడగానే లబ లబ లాడాడు భర్తగారు. మా అమ్మగారు ఈ మాటవిన్నారంటే గుండేసి ఒక్క దెబ్బతో మనంతరి నెత్తినా ఈ ఆసుపత్రి భవనాన్ని కూల్చిపారేస్తుంది"

"మరేం పర్లేదు. మీరు కంగారు పడకండి" చల్లగా పలికిందా సజ్జని.

"అల్లాంటి ప్రమాదం ఎదురయినపుడు దానికితగ్గట్టుగా మరో చక్కని అబద్ధం సృష్టిద్దాం' ఓ అడుగు ముందుకువేసి ... ఓ క్షణం ... ఆగి అన్నారావిడ. "మీ అమ్మగారికి నా నమస్కారాలు చెప్పండి. చెపుతారు గదూ ! నరకమంటూ ఒకటి ఇప్పటికే లేని పక్షంలో దాన్ని వెంటనే సృష్టించడం అత్యవసరం అన్నానని కూడా ఆవిడతో చెప్పండి".

ఒకే ఒక్క అబద్ధంతో రెండు ప్రాణాలు నిలబెట్టిందా డాక్టరమ్మ. వివాదహేతువయిన ఆ ఆరో ఆడపిల్లకు కూడా కడుపారా పాలుకు డిపింది.

ఆ వివాదాస్పదమైన ఫలితానికి మూల కారకుడైన భర్తగారు తన దడ దడలాడే గుండెలను అరచేత పట్టుకొని తమ ఎత్తు గోడల రాజసౌధం చేరారు.

మరికొన్ని రోజుల తర్వాత ఆ భర్తగారు తిరిగి వచ్చినపుడు .. ఈ సారి అనూహ్యామైన వార్త వినడం డాక్టర్ జాకబ్ వంతయింది.

ఆ రాజమాత పరమపదించారట !!

ఆనాడు బిక్కుబిక్కుమంటూ ఇల్లు చేరిన భర్తగారు భయం భయంగా - అయినా అది స్పష్టంగా - ఆరోసారీ ఆడపిల్లే అన్నమాట తన తల్లిగారి చెవినవేసాడట. ఆ కబురు విని చేష్టలుడిగి చతికిలపడిన ఆ రాజమాతగారి హింస క్షణాల్లో ఎగిరిపోయిందట ! (ఆ మాట విని వినగానే డాక్టరమ్మ క్రిష్టియన్ బాణీలో తన నుదురూ భుజాలను కుడి చేతి మునివేళ్లతో తాకి "క్రాస్" గుర్తు చేసారు)

కడ సారి కోడలి ఆరో అఘాయిత్యం అత్తగారి గుండెల్ని బద్దలు కొట్టేసింది.

"బయటకు ఎంత రాతిగుండెలా కనిపించినా నిజానికా మహాతల్లి గుండె ఓటికుండ" సిద్ధాంతీకరించాడట ఆ గ్రామపు వైద్యాచారి.

★ ★ ★

కథ ముగించిన డాక్టర్ కాళీ మా అందరి నవ్వులతో శృతి కలిపింది. ఆ నవ్వుల్లో పాలు పంచుకోందామని మా ఆవిడ విఫల ప్రయత్నం చేసింది.

"నాకు అత్తరికపు ఆరడిలేదు" అని నిట్టూర్చింది.

అన్నట్టు మా ఆవిడ కిది ఆరోకానుపు. ఆరోసారైనా మగపిల్లాడవడా అన్న ఆశతో ఉంది తన కానుపు కోసం మేమంతా డాక్టర్ కాళీగారి మెటర్నటీ హోంలో ఉన్నాం.

మా ఆవిడను ఉల్లాసపరచడానికి డాక్టర్ కాళీ చేస్తోన్న ప్రయత్నానికి ఊతమిస్తూ నేను అన్నాను. "మీ కథలో ఆ ఆరో పాపను నిజంగా మెచ్చుకోవాలి. మహా గడుగ్గాయిలా ఉంది. నేనే ఆ పాపకు తండ్రినయిఉంటే ముందస్తుగా ఓ చక్కని పేరు పెట్టి ఉండేవాడిని.'

"ఆ పాపకు డాక్టర్ జాకబ్బే పేరు పెట్టారు" అన్నారు డాక్టర్ కాళీ.

"ఏం పేరూ .....?"

"కాళి" అందుకొన్నారు డాక్టర్ కాళీ గారి భర్త. ఆయన అప్పుడే వచ్చి వాళ్ల పిల్లల్తో సహా మమ్మల్ని చేరారు. "ఆ పాపకు కాళీ అనిపేరు పెట్టారు. మహాశక్తి .. దుష్టసంహారిణి .. కాళీ"

వాళ్ళ పిల్లలకేసి చూసాను. అయి దుగురు. అందరూ ఆడపిల్లలే ! మా పిల్లలకేసి చూసాను. వాళ్ళ పిల్లలకూ మా పిల్లలకూ ఎన్ని పోలికలో !

డాక్టర్ కాళీ నవ్వారు. వాళ్ళ పిల్లలు నవ్వారు. మా పిల్లలు శృతి కలిపారు. ఆ పదిమంది ఆడపిల్లల నవ్వులు పువ్వులై గదంతా విరగబూసాయి. డాక్టర్ కాళీగారి భర్త స్నేహంగా నా భుజం తట్టి అన్నారు. "మీరు తొందరపడటం మంచిది. మరో నెలరోజుల్లో డాక్టర్ కాళీ డాక్టర్ జాకబ్‌గారి ఊరు వెళ్ళి ఆవిడ మెటర్నటీ హోమ్‌లో చేరనుంది. తన ఆరో "ఆడ పిల్ల కోసం"నవ్వుతూ లేచి నుంచొంటూ అంది డాక్టర్ కాళీ. మా ఆవిడ కాళీ కేసి చూసింది. తన పెదవుల మీద ఓ చిరునవ్వు తారాడింది. అరక్షణంలో అది పరిపూర్ణ హాసమయింది

"నాన్నా ! మనింట్లో ఇదే ఆఖరు పాప కావాలి" హెచ్చరించింది వాళ్ల పాప. అయి దారేళ్లది. అందరి కన్నా చిన్నది !

★ ★ ★

